# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 268 | శనివారం, 05 సెప్టెంబర్ 2026


## జనగామలో ఘనంగా
# కృష్ణాష్టమి వేడుకలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నెహ్రూ పార్క్ నుండి బస్టాండ్ వరకు యాదవులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్,మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ తదితరులు హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ కార్యక్రమాలతో ప్రజా సంక్షేమానికి కృషి చేస్తుందని అన్నారు. అదేవిధంగా కృష్ణాష్టమి ప్రాధాన్యతను గురించి మాట్లాడారు. కాగా, జిల్లాలోని పలువురు యాదవ సంఘం నాయకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





## కాంగ్రెస్ పాలనలో హామీలు బాకీలు..
# ప్రజలకు కన్నీళ్లు

- కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులకు కాంగ్రెస్ రిబ్బన్ కట్ చేస్తోంది
- ప్రతిపక్ష గొంతు నొక్కేందుకు కేసులు, అరెస్టులు
- జనగామలో కేసులు, అరెస్టులే మిగిలాయి
- తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్

**జనగామ, మన చౌరాస్తా :** ఎన్నికల వేళ ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ప్రజా సమస్యలు గాలికి.. ఢిల్లీ చుట్టూ ప్రయాణాలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఢిల్లీ చుట్టూ తిరగడానికే పరిమితమైందని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో నిరంతరం అందిన తాగునీరు, విద్యుత్ సరఫరా ఇప్పుడు ఎందుకు నిలిచిపోయిందో ప్రజలకు తెలుసన్నారు. మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, రూ.500 వరి బోనస్, పూర్తి స్థాయి రుణమాఫీ వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**కేసీఆర్ శ్రమను తమ ఖాతాలో వేసుకుంటున్నారు**

కేసీఆర్ హయాంలో శంకుస్థాపన చేసిన ఫ్లైఓవర్లు, ఇతర ప్రాజెక్టులకు కాంగ్రెస్ నాయకులు కేవలం రిబ్బన్ కట్ చేసి తమ ఖాతాలో వేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రతీ జిల్లాకు మెడికల్ కాలేజీ, కలెక్టరేట్లు, కాళేశ్వరం ప్రాజెక్టు, 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలు కేసీఆర్ విజన్‌కు నిదర్శనమని పేర్కొన్నారు.

**జనగామలో దౌర్జన్యాలు, అక్రమ కేసులు**

ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని పాలన సాగిస్తోందని మండిపడ్డారు. జనగామలో ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఖండించారు. 22A నిబంధనతో ప్రజల వారసత్వ భూములను నిషేధిత జాబితాలో చేర్చి వేధిస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని తలసాని స్పష్టం చేశారు.






# నేత్ర పర్వంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణం లోని శ్రీమద్భగవద్గీత ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నేత్ర పర్వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జన్మాష్టమి వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలలకు చెందిన వందలాది మంది చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. చిన్నారులు పద్యాలు, భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి భక్తులను అలరించారు. విద్యార్థులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

**భక్తిశ్రద్ధలతో విశేష పూజలు**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం, విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రోజంతా ఆశ్రమంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం భక్తుల ఉత్సాహం మధ్య ఉట్టి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పావళింపు సేవతో జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి. ఈ కార్యక్రమంలో శ్రీమద్భగవద్గీత ఆశ్రమం అధ్యక్షులు కొడిపాక ప్రభాకర్, కొడిపాక బాలరాజు, తాళ్లపల్లి నాగరాజు, గునిగంటి రామకృష్ణ, 6వ వార్డు కౌన్సిలర్ బుక్కా బాలభరద్వాజ్, లగిశెట్టి కిషోర్, కాసం నవీన్, కన్నా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు శ్రీకృష్ణుడిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# పూర్ణిమ కాలనీలో ఘనంగా వేడుకలు



**జనగామ, మన చౌరాస్తా :** పట్టణంలోని పూర్ణిమ కాలనీలో ప్రబోధ సేవా సమితి - ఇందూ జ్ఞాన వేదిక (చేర్యాల కమిటీ) ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణ ప్రతిమకు ప్రత్యేక పూజలు చేసి, "కృష్ణం వందే జగద్గురుమ్" నినాదాల మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో శోభాయాత్ర నిర్వహించారు. భగవద్గీత సందేశాన్ని, శ్రీకృష్ణ తత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని నిర్వాహకులు కోరారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి ముఖ్య అతిథిగా పాల్గొనగా, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాచం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, ఉడుముల రమేష్, కంది శ్రీనివాస్, స్థానిక వార్డు సభ్యులు, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్ల తిరుపతిరెడ్డి, బాధ్యులు కోటి, రాజకిరణ్, మురళి, కాలనీ పెద్దలు సత్తయ్య, అశోక్, కిరణ్, హరిప్రసాద్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని తాటికొండ పంచాక్షరీ, యాదగిరి, మెరుగు రామరాజు, ఎదునూరి రాజు, ఈగ భాస్కర్, లావణ్య, దేవేందర్, ఉపేందర్, కవిత, లింగస్వామి, ప్రసాద్, శ్రీనాథ్ సమిష్టి కృషితో విజయవంతంగా నిర్వహించారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్

**జనగామ, మన చౌరాస్తా :** త్రైత సిద్ధాంతము వారి ఆధ్వర్యంలో ప్రబోధ సేవా సమితి - హిందూ జ్ఞాన వేదిక, చేర్యాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కడకంచి బాలమణి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె శ్రీకృష్ణుని పల్లకి ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, భగవంతుడైన శ్రీకృష్ణుడు జ్ఞానమునకు, అజ్ఞానమునకు సంధి లాంటివాడని, అజ్ఞానం నుండి జ్ఞానానికి, జ్ఞానం నుండి అజ్ఞానానికి పయనించుటకు ఆయన ఒక కేంద్రం లాంటివాడని తెలియజేశారు. అలాగే కలియుగ ప్రారంభంలో దేశమంతటా ముఖ్యమైన పండుగగా శ్రీకృష్ణ జన్మాష్టమి జరుపబడిందని, దేశంలో మొట్టమొదటి వీధి ఉత్సవం శ్రీకృష్ణ జన్మాష్టమి అని ఆమె తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# బాలాజీ నగర్‌లో ఉత్సాహంగా కృష్ణాష్టమి సంబరాలు

**జనగామ, మన చౌరాస్తా :** పట్టణంలోని బాలాజీ నగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను చిన్నారులు అత్యంత ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. నిష్కల్మషమైన స్నేహభావంతో కాలనీ పిల్లలందరూ ఒకటై ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు పెద్దోజు శాన్వి, పెద్దోజు ఆదిత్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అందరినీ అలరించారు. ఇంటింటికీ తిరుగుతూ పిల్లలు చేసిన సందడిని చూసి కాలనీ పెద్దలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి వేడుకలు పిల్లల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి, వారి వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు.











# రైతు బిడ్డకు వరంగల్ కేఎంసీలో సీటు

జనగామ, మన చౌరాస్తా : కష్టపడే తత్వం, పట్టుదల ఉంటే పేదరికం చదువుకు అడ్డంకి కాదని నిరూపించింది జీడికల్ గ్రామానికి చెందిన నల్ల శ్వేత. వ్యవసాయమే జీవనాధారంగా కష్టపడుతున్న నల్ల బిక్షపతి, మంజుల దంపతుల కుమార్తె శ్వేత, వైద్య విద్య (ఎంబీబీఎస్)లో సీటు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. శ్వేత తన ప్రాథమిక విద్యను తెలుగు మాధ్యమంలోని ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేసింది. అనంతరం ప్రభుత్వ కళాశాలలోనే ఇంటర్మీడియట్ చదివింది. తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం, తన సొంత కృషితో నీట్ (NEET) రాసి, మొదటి విడత సీట్ల కేటాయింపులోనే ప్రసిద్ధ వరంగల్ కాకతీయ వైద్య కళాశాల (KMC)లో ఎంపీబీఎస్ సీటును కైవసం చేసుకుంది.

**అన్నయ్య మార్గదర్శకత్వం..**

శ్వేత విజయంలో ఆమె అన్నయ్య చందు పాత్ర కీలకమైనది. ఇప్పటికే వైద్య విద్యను పూర్తి చేసిన చందు, తన అనుభవంతో చెల్లెలికి నిరంతరం మార్గదర్శనం చేస్తూ, సబ్జెక్టుల పై సరైన దిశానిర్దేశం చేశాడు. తల్లిదండ్రుల రెక్కల కష్టం, అన్నయ్య అందించిన ప్రోత్సాహం, శ్వేత క్రమశిక్షణతో కూడిన పట్టుదలే ఈ రోజు ఈ ఘనవిజయానికి బాటలు వేశాయని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రైతు కుటుంబంలో పుట్టి, ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి వైద్య సీటు సాధించిన శ్వేతను కుటుంబ సభ్యులు, బంధువులు, జీడికల్ గ్రామస్తులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**